క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కోటి కుంకుమార్చన



కోటి కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. మహా గౌరీ పరదేవతా సన్నిధిలో నిర్వహిస్తున్న లలితా సహస్రనామ పారాయణ పూర్వక కోటి కుంకుమార్చన మహాయజ్ఞంలో భాగంగా విశేష పూజలు జరిగాయి. గణపతి పుణ్యాహవచనం, మంటపారాధన, కలశ స్థాపన, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మోసాలకు పాల్పడితే చర్యలు



ఎలక్ట్రానిక్ కాటాను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ పీఎం పరమేశ్వర కుమార్

కర్నూలు (న్యూసిటీ): ఎవరైనా వ్యాపారులు తూకాలు, విక్రయాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పీఎం పరమేశ్వర కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక వెంకటరమణ కాలనీ రైతు బజార్‌లో ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సబ్సిడీ టమాట కౌంటర్‌ను తనిఖీ చేసి, ఎలక్ట్రానిక్ కాటాను పరిశీలించారు. అనంతరం మండీ బజార్, పూల బజార్, చిన్న మార్కెట్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 30 ఎలక్ట్రానిక్ కాటాలను సీజ్ చేశారు. కాటాలకు సీల్ లేకుండా వినియోగిస్తుండడంతో రెండు దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేసి రూ.4 వేల అపరాధ రుసుం విధించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



డాక్టర్ వెంకటరంగారెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న నాల్గవ తరగతి ఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్): నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి చెప్పారు. గురువారం ఆయనను ఆసుపత్రిలోని నాల్గవ తరగతి ఉద్యోగులు, ఎంఎన్‌ఓలు, ఎఫ్‌ఎన్‌ఓలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఒంగోలుకు బస్సు సర్వీసు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నుంచి ప్రకాశం జిల్లా ఒంగోలుకు శుక్రవారం నుంచి అల్ట్రా డీలక్స్ బస్సు సర్వీసును నడపనున్నట్లు వన్ డిపో మేనేజరు సుధారాణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి రోజు రాత్రి 10:30 గంటలకు కొత్త బస్టాండ్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5:45 గంటలకు ఒంగోలుకు చేరుకుంటుందన్నారు. అక్కడ రాత్రి 11 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు కర్నూలుకు చేరుకుంటుందన్నారు. అలాగే ప్రతి రోజు రాత్రి కర్నూలులో 10 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి బెంగళూరులోని పీన్య బసవేశ్వర బస్టాండ్‌కు మరుసటి రోజు ఉదయం 6:30 గంటలకు చేరుకుంటుందని, అక్కడి నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5:15 గంటలకు కర్నూలుకు చేరుకుంటుందని, ఈ రెండు బస్సుల్లో ప్రయాణించేందుకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

టమాటాకు పోటెత్తిన ప్రజలు


కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని సీ.క్యాంపు, అమీన్ అబ్బాస్ నగర్, కొత్తపేట రైతుబజార్లలో ఏర్పాటు చేసిన సబ్సిడీ టమాటా కోసం గురువారం ప్రజలు పోటెత్తారు. బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.150కి పైగా పలుకుతుండగా ప్రభుత్వం మదనపల్లి నుంచి కొనుగోలు చేసి సబ్సిడీపై ప్రజలకు రూ.50 కిలో చొప్పున పంపిణీ చేసింది. సీ.క్యాంపు రైతుబజారులో 3,250 కిలోలు, అమీన్ అబ్బాస్ నగర్, కొత్తపేట రైతుబజార్లకు 3,250 కిలోల టమాటాలను పంపిణీ చేసినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు.



గ్రంథాలయాల సమస్యలపై విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను గురువారం విజయవాడలో కర్నూలు, కృష్ణా, విజయనగరం జిల్లాల గ్రంథాలయ సంస్థల చైర్మన్‌లు సుభాష్ చంద్రబోస్, అన్నపూర్ణమ్మ, రెడ్డి పద్మావతిలు కలిసి వినతి పత్రాలు అందజేశారు. అలాగే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌ను కలిశారు.
– కర్నూలు కల్చరల్

వామ్మో నొప్పి..

- పెరుగుతున్న కీళ్లు, ఎముకల బాధితులు
- ఉమ్మడి జిల్లాలో 3 లక్షల మందికి పైగా కీళ్ల సమస్యలు
- ఎక్కువగా కూర్చుని పనిచేయడమే కారణం
- రోజూ వ్యాయామం తప్పనిసరి
- సమతుల ఆహారమూ తీసుకోవాలి
- తప్పనిసరైతేనే కీళ్ల మార్పిడి
- నేడు జాతీయ ఎముకలు, కీళ్ల దినోత్సవం



కర్నూలు(హాస్పిటల్): మారుతున్న జీవనశైలి కారణంగా అనేక ఆరోగ్యసమస్యలు చుట్టుముడుతున్నాయి. ఆఫీస్ సమయంలో ఎక్కువ సమయం కూర్చోవడం, లేదా డ్రైవింగ్ చేయడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో కీళ్లనొప్పులతో బాధపడే వారి సంఖ్య అధికమవుతోంది. దీనిపై అవగాహన తీసుకురావడానికి ఏటా ఆగస్టు 4న జాతీయ ఎముకలు, కీళ్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

జిల్లాలో మోకాళ్ల నొప్పులు(ఆస్టియో ఆర్థరైటిస్), కీళ్లవాతం(రుమటాయిడ్ ఆర్థరైటిస్)తో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గతంలో జనాభాలో 4 శాతం ఉన్న వీరి సంఖ్య ఇప్పుడు 6 శాతానికి చేరుకుంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 3 లక్షల మంది దాకా కీళ్ల జబ్బులతో బాధపడుతున్నట్లు వైద్యుల అంచనా. మొదట్లో నగరాలు, పట్టణాల్లో మాత్రమే ఈ బాధితులు అధికంగా ఉండేవారు. ఇప్పుడు పల్లెల్లో కూడా పెరుగుతున్నారు. శారీరక శ్రమ తగ్గిపోవడం, పోషకాహారంలో పించడం, జంక్ ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్ తినడం వంటి కారణాలతో కీళ్ల జబ్బులతో బాధపడే వారి సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు 60 ఏళ్లు దాటిన వారిలో కీళ్ల సమస్య అధికంగా కనిపించేది. ఇప్పుడు పాతికేళ్ల వయస్సు నుంచే మొదలవడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో గ్రామాల్లో చాలా మంది సమీపంలో ఉండే ఆర్‌ఎంపీల వద్దకు వెళ్తున్నారు. వారిచ్చే నొప్పినివారణ మందులను వాడుతూ జీవితాన్ని వెళ్లదీస్తున్నారు. మరికొందరు నేరుగా మెడికల్ షాపులకు వెళ్లి మందులను కొని వాడుతున్నారు. కొద్ది మంది మాత్రమే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోని వైద్యుల వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కీళ్ల నొప్పులు తగ్గించే మందులు, ఉపశమనం కలిగించే మందులతో పాటు కీళ్లలో గుజ్జు పెంచే మందులని అటు ఆయుర్వేదంతో పాటు ఇటు అల్లోపతిలోనూ మందులు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. దీంతో పాటు కీళ్లలో సహజంగా గుజ్జు పెంచుతుందని చెప్పి పీఆర్‌పీ చికిత్స చేస్తున్నారు. చివరగా కీళ్ల మార్పిడి ఆపరేషన్‌కు వెళ్తున్నారు. ఈ మేరకు కర్నూలు, ఆదోని, నంద్యాల పట్టణాల్లో ఎముకలు, కీళ్ల వ్యాధుల వైద్యుల సంఖ్య 150కి పైగానే పెరిగింది.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

వయస్సు మీద పడిన వారు ఎక్కువగా పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. వీరు ఎముక ఆరోగ్యానికి కావాల్సిన కాల్షియం, ప్రొటీన్లు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. వైద్యుల సూచన మేరకు కాల్షియం, విటమిన్–డి మాత్రలు వాడాలి. బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. ఇందు కోసం నియమిత ఆహారం, మందులు తీసుకోవాలి. శరీర బరువును నియంత్రించుకోవాలి. కండరాలు, ఎముకలను బలోపేతం చేసుకోవడానికి రోజూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. దూమ, మద్య పానానికి దూరంగా ఉండాలి. నీరు, చమురు, నూనె పడిన చోట, భవనాల మెట్లు వంటి జారే ప్రాంతాల నుంచి దూరంగా ఉండాలి.

నొప్పుల మాత్రలతో కిడ్నీ, గ్యాస్ సమస్యలు



కీళ్ల నొప్పులతో బాధపడే వారు ఎక్కువగా నొప్పుల నివారణ మాత్రలు వాడకూడదు. దీనివల్ల కిడ్నీలు దెబ్బతినడం, గ్యాస్ట్రబుల్ అధికం కావడం జరుగుతుంది. కీళ్ల నొప్పులు తగ్గించుకునేందుకు అవసరమైన వ్యాయామం, ఫిజియోథెరపీ చేయించుకోవాలి. ఎక్కువసేపు ఏసీ రూముల్లో కూర్చుని పనిచేసేవారికి కీళ్లు బలహీనపడతాయి. అధిక బరువు వల్ల కూడా కీళ్లలో కార్టిలేజ్ కరిగిపోయి, ఎముకలు మెత్తబడతాయి. ముఖ్యంగా థైరాయిడ్ ఉన్న వారిలో అధిక బరువు వచ్చి ఎముకల్లో సమస్యలు వస్తాయి. నడవలేని పరిస్థితుల్లో ఉన్న వారు వైద్యులను సంప్రదించి కీళ్లమార్పిడి ఆపరేషన్ చేయించుకోవాలి.
– డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్, ఆర్థోపెడిక్ విభాగం, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

వాతావరణ మార్పులతో కీళ్లలో సమస్యలు



వాతావరణ మార్పుల కారణంగా కీళ్లలో సమస్యలు అధికంగా ఉంటాయి. చలిగా ఉన్న సమయంలో కీళ్లనొప్పులు ఎక్కువవుతాయి. మోకాళ్ల నొప్పులు, రుమటాయిడ్ ఆర్థరైటిస్ ఉన్న వారిలో సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. వైద్యుల సలహా, సూచనల మేరకు మందులు వాడుతూ వ్యాయామం చేస్తూ ఉండాలి. అవసరమైతే ఫిజియోథెరపీ చేయించుకోవాలి. మోకాళ్ల నొప్పి ఉన్న వారు మెట్లెక్కడం, కింద కూర్చోవడం, పద్మాసనంలో కూర్చోవడం చేయరాదు. వెస్ట్రన్ టాయిలెట్‌లోనే కూర్చోవాలి.
– డాక్టర్ పి.కిరణ్‌కుమార్, ఆర్థోపెడిక్ సర్జన్, కర్నూలు

మెడికల్ మాఫియాను అరికట్టాలి

కర్నూలు(రూరల్): నాసిరకం మందులను విక్రయిస్తూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న మెడికల్ మాఫియాను అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం సీఆర్ భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెడికల్ మాఫియా ఆగడాలు రోజు రోజుకు పెరిగిపోతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ రకరకాల టెస్ట్‌ల పేరుతో వేల రూపాయలు దోచుకుంటున్నాయన్నారు. సంబంధిత అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో చిన్మయానంద స్వామి ఆరాధన


కర్నూలు కల్చరల్: పూజ్య గురుదేవులు స్వామి చిన్మయానంద ఆరాధనను గురువారం వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావలి భవనంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద భక్తులకు సందేశం ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు (రాజ్‌విహార్): ప్రజా రవాణా శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.శంకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పి.నాగన్న కోరారు. కొత్తగా ఏర్పాటైన ఆసంఘం జిల్లా కమిటీ గురువారం జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి టి.వెంకటరామంను కలిసి, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంబీఎల్ శాస్త్రి, ముఖ్య సలహాదారు ఎం.ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ రుషి పరంపరను కాపాడుకుందాం

- మహా సహస్రావధాని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ స్వామి



మాట్లాడుతున్న మహా సహస్రావధాని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ స్వామి

కర్నూలు కల్చరల్: భారతీయ రుషి పరంపరను కాపాడుకోవాల్సిన అవసరముందని ప్రణవ పీఠాధిపతి, ఆధ్యాత్మిక వేత్త, అభినవ శుక త్రిభాషా మహా సహస్రావధాని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ స్వామి అన్నారు. నగర శివారులోని గోదాగోకులంలో మహర్షుల చరిత్రపై ఏర్పాటు చేసిన రెండు రోజుల ఆధ్యాత్మిక ప్రవచనంలో మొదటి రోజు గురువారం ఆయన ప్రవచనం చెప్పారు. భారతీయ రుషి పరంపర గొప్పదని ఆధునిక శాస్త్రవేత్తలు, యంత్రోపాసకులు, రుషులు మంత్రోపాసకులని వారి ఉపాసనంతా లోక సంక్షేమం కోసమేనని చెప్పారు. సనాతన హిందూ ధర్మాన్ని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ భావి తరాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు, ప్రయాగ త్రిదండి రాఘవ ప్రసన్న జీయర్ స్వామీజీ, జిల్లా న్యాయ మూర్తి నేరెళ్ల శ్రీనివాసరావు దంపతులు, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట నాగ శ్రీనివాసులు, గోదాగోకులం మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సభ్యులకు నియామక పత్రాలు



సభ్యులతో మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్, కాటసాని, కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన కార్పొరేటర్లు సంగాల సుదర్శన్ రెడ్డి, ఆత్మకూరు నాగలక్ష్మిరెడ్డి, కె.పద్మాలతారెడ్డి, జీవీఎల్ సుజాతలకు స్థానిక నగర పాలక మేయర్ చాంబర్‌లో గురువారం మేయర్ బీవై రామయ్య, కర్నూలు,పాణ్యం ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కాట సాని రాంభూపాల్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. నగర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మరో సభ్యుడు నగరూరు శ్రీనివాసరావు వ్యక్తిగత పని నిమిత్తం గైర్హాజరయ్యారని, వచ్చిన తర్వాత నియామక పత్రం అందజేస్తామని కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు.

తల్లిపాలలో వ్యాధినిరోధక శక్తి



మాట్లాడుతున్న డాక్టర్ విజయానందబాబు

కర్నూలు(హాస్పిటల్): తల్లిపాలలో వ్యాధినిరోధక శక్తి ఉంటుందని, వీటిని తాగిన పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ వెంకటరమణ, చిన్నపిల్లల విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ విజయానందబాబు తెలిపారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం ఆసుపత్రిలోని గైనకాలజీ విభాగంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ జన్మించిన వెంటనే గంటలోపు తల్లి పాలివ్వాలన్నారు. ప్రారంభంలో వచ్చే ముర్రుపాలు ఎంతో బలవర్ధకమైనవన్నారు. చాలా మంది వీటిని తాగించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, ఈ పాలలో పోషకాలు, ప్రొటీన్లు, మినరల్స్ ఉంటాయని, వ్యాధినిరోధక శక్తి కలగజేసి పిల్లలకు వ్యాధుల నుంచి కాపాడతాయన్నారు. ఆరు నెలల వరకు కేవలం బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలని, ఆ తర్వాత తేలికపాటి ఆహారం ఇవ్వాలని సూచించారు. రెండేళ్ల వరకు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గైనకాలజిస్టులు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ స్నిగ్ధ, డాక్టర్ కుముద, డాక్టర్ మమత పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై టౌన్‌ప్లానింగ్ కొరడా

- జొహరాపురంలో రాళ్లు, ప్రహరీ తొలగింపు



అక్రమంగా వెలసిన వెంచర్లలో రాళ్లు తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

కర్నూలు (టౌన్): నగర పరిధిలోని జొహరాపురం నుంచి పడిదెంపాడు రోడ్డు మీదుగా అనుమతులు లేకుండా వెలసిన 6 వెంచర్లపై టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. సర్వే నంబర్ 29, 31, 38, 42, 46 51ఏలలో నగరపాలక అనుమతులు తీసుకోకుండా వేసిన వెంచర్లలోని రాళ్లను టౌన్‌ప్లానింగ్ అడిషనల్ సిటీ ప్లానర్ రంగస్వామి, సూపర్ వైజర్ హరీష్ చౌదరిలు చైన్‌మెన్లు చైన్‌మెన్లు శ్రీనివాసులు, రమణ, సిబ్బందితో కలిసి వెళ్లి తొలగించారు. ప్రహరీని సైతం కూల్చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నగరపాలక పరిధిలో వెంచర్లు, వాణిజ్య, రెసిడెన్షియల్ భవనాల విషయంలో తప్పని సరిగా టౌన్‌ప్లానింగ్ అనుమతులు తీసుకోవాలన్నారు.

సృజనాత్మకతను వెలికి తీయాలి

- కర్నూలు డివిజన్ ఉపవిద్యాధికారి కె.హనుమంతరావు



మాట్లాడుతున్న కర్నూలు డివిజన్ ఉపవిద్యాధికారి కె.హనుమంతరావు

కర్నూలు కల్చరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని కర్నూలు డివిజన్ ఉపవిద్యాధికారి కె.హనుమంతరావు సూచించారు. గురువారం దేవనగర్‌లోని గుడ్ షప్పర్డ్ పాఠశాలలో ఇన్‌స్పైర్ మానక్ –2023–24 నామినేషన్స్‌కు సంబంధించి కర్నూలు డివిజన్‌లోని సైన్స్ ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ఐదు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు ప్రాజెక్టులు సిద్ధం చేసుకోవాలన్నారు. వర్తమాన పరిస్థితులు, సమాజానికి ఉపయోగ పడే అంశాలపై ప్రాజెక్టులు తయారు చేయించాలన్నారు. విద్యార్థుల మేధస్సు పెరిగేలా నమూనాలు ఉండాలన్నారు. నామినేషన్స్‌ను www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలో 3,352 నామినేషన్స్ వచ్చాయన్నారు. వాటిలో 352 ప్రాజెక్టులు ఎంపికయ్యాయన్నారు. ఈ ఏడాది 5 వేల నామినేషన్స్ లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఈనెల 31వ తేదీలోగా నామినేషన్స్‌ను రిజిస్టర్ చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్స్ సునీల్‌కుమార్, ఇ.వై.దాస్, ఎ.రాజశేఖర్, బేగ్, మరియానందమ్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

ప్రజా సేవే ప్రభుత్వ లక్ష్యం

- జగనన్న సురక్ష ద్వారా 73 వేల మందికి ధ్రువపత్రాలు అందజేశాం
- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



మాట్లాడుతున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజలకు మంచి సేవలందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు.గురువారం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల రోజుల పాటు జగనన్న సదస్సులునిర్వహించి నియోజకవర్గంలో 73 వేల మందికి వారికి కావాల్సిన సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్ల సహకారంతోనే ఇదంతా చేయగలిగామన్నారు. అయినా టీడీపీ నాయకులు అర్థం లేని విమర్శలు చేయడం తగదన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ఇళ్లకే పరిమితమైన టీజీ వెంకటేష్, టీజీ భరత్‌లకు ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలు గుర్తొచ్చారన్నారు.మిగతా రోజుల్లో వ్యాపారాల్లో మునిగితేలడం తప్ప ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సిద్ధాంతాలు లేకుండా తండ్రీకొడుకులు చెరో పార్టీలో ఉండి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ వాళ్ల ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ కాదని,అది ప్రజల సొత్తు అని అన్నారు. కిడ్స్ వరల్డ్‌లోనూ డబ్బు తీసుకొని వదులుతున్నారని, సొసైటీ ఎన్నికల ద్వారా మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదాయం చేకూర్చాలన్నదే తన తపన అన్నారు.అసలు ఇన్నేళ్లుగా ఆ సొసైటీ నుంచి ఎంత ఆదాయం వచ్చింది.. కార్పొరేషన్‌కు ఎంత చెల్లించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు యూనుస్ బాషా, పార్టీ నాయకులు ప్రసాద్, మహబూబ్ అలీ, కృష్ణకాంత్ శర్మ, సూర్యుడు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు సద్వినియోగం చేసుకోండి

వలంటీరు వ్యవస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సూచించారు. గురువారం ఆయన స్థానిక 5వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్తరి వీధి ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల కోసం పేదలు కార్యాలయాల చుట్టూ తిరగరాదనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ సేవలు తీసుకొచ్చారన్నారు. వీళ్ల ఇంటి వద్దకే వచ్చి ప్రభుత్వ సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాత, పార్టీ నాయకులు శేషయాదవ్, హజ్ కమిటీ సభ్యుడు మౌలానా మంజూర్, నాయకులు అక్బర్ అలీ, మహబూబ్ బాషా, మక్బూల్, అబ్దుల్లా, కార్యకర్తలు పాల్గొన్నారు.



చిత్తారి గేరిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

సురక్షతో ప్రజలకు ఎంతో మేలు

- 82 వేల మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశాం
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరిగిందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ చిన్న ధ్రువపత్రం కావాల్సి వచ్చినా ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇలాంటి కష్టాలను తొలగించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. నెల రోజుల పాటు జగనన్న సురక్ష సదస్సులు నిర్వహించి నియోజకవర్గంలో 82 వేల మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు.

వైఎస్ చలువతోనే ప్రాజెక్టులు

దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞం పేరుతో నదులపై ప్రాజెక్టుల సామర్థ్యం పెంచడంతో పాటు అవసరమైన చోట్ల కొత్త ప్రాజెక్టులు నిర్మించారని ఎమ్మెల్యే రాంభూపాల్ రెడ్డి అన్నారు. చంద్రబాబు హయాంలో ఎస్‌ఆర్‌బీసీ, గోరుకల్లు రిజర్వాయర్లకు పైసా నిధులు ఇవ్వలేదన్నారు. సీమకు న్యాయం చేసింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మాత్రమే అని ప్రస్తుతం ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సీమ సస్యశ్యామలంగా ఉందని చెప్పారు. నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అందిస్తుండగా రాష్ట్రాన్ని మరో శ్రీలంకగా మార్చుతున్నారని విమర్శించిన నేతలే ఇప్పుడు ఇంట్లో పాఠశాలకు వెళ్తున్న పిల్లలందరికీ అమ్మ ఒడి ఇస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం అభ్యర్థి చంద్రబాబో, పవన్‌కళ్యాణో ముందుగా తేల్చుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, శ్వేతారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, కల్లూరు అర్బన్ వార్డుల జేసీఎస్ ఇన్‌చార్జ్ కన్వీనర్లు హనుమంతురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ కాంతులు

కల్లూరు: నవరత్నాలతో ఇంటింటా సంక్షేమ కాంతులు వెదజలుతున్నాయని నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో పూలే అంబేడ్కర్ కొట్టాలు, రాంప్రియ నగర్‌లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పాలనపై ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఇంటి స్థలం మంజూరు చేయాలని, కుళాయిలకు తాగునీటిని రాత్రి సమయంలో కాకుండా ఉదయమే సరఫరా చేయాలని, కల్వర్టులు, డ్రైనేజీ కాలువలు, రోడ్లు నిర్మించాలని కోరగా.. ఎమ్మెల్యే, మేయర్ స్పందించిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వీరశైవలింగాయ్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాసులు, లక్ష్మిరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అరుణ పాల్గొన్నారు.

అన్ని వార్డులను అభివృద్ధి చేస్తాం

కల్లూరు: నగరంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 31వ వార్డులోని రామ్ రహీమ్ నగర్, ఓబులయ్య నగర్‌లలో రూ. 50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, మురుగు కాలువ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మిద్దె చిట్టెమ్మ, నాగలక్ష్మిరెడ్డి, శ్వేతారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై యాజమాన్యం నిర్లక్ష్యం వీడి పరిష్కరించే వరకు తమ పోరు ఆగదని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గణేష్ అన్నారు. స్థానిక విద్యుత్ భవన్ ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు కొనసాగాయి. గురువారం ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఏఈలు, ఏడీఈలు, సబ్ ఇంజినీర్లు దీక్షల్లో కూర్చున్నారు. శుక్రవారం నుంచి వర్క్ టు రూల్ కార్యక్రమంలో భాగంగా విధులు నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు కార్యాలయ సిబ్బంది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర ఫీల్డ్ సిబ్బంది (ఓ అండ్ ఎం) ఉదయం 8:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే విధుల్లో ఉంటారని, వినియోగదారులు సహకరించాలని కోరారు. కాగా దీక్షా శిబిరాన్ని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సందర్శించి సంఘీభావం తెలిపారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత

కర్నూలు కల్చరల్: బాలల పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ –1098 కోఆర్డినేటర్ సుంకన్న అన్నారు. గురువారం కాంకర్ ఒకేషనల్ కళాశాలలో బాలల హక్కులు, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలబాలికలు ఎలాంటి ఆపదలో ఉన్నా చైల్డ్ హెల్ప్ లైన్ –1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ నరసింహులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.